ముగిసిన ప్రచార పర్వం

గచ్చిబౌలి: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వం శేరిలింగంపల్లిలో ప్రశాంతంగా ముగిసింది. ప్రధాన పార్టీలు చివరి రోజు సుడిగాలి పర్యటనలతో తమ ప్రచారాన్ని ముగించాయి. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువు ప్రకారం మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రచారం ముగిసింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ర్యాలీలకు ప్రాధాన్యత ఇచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ బైక్ ర్యాలీలలో పాల్గొన్నారు. పది డివిజన్లలో బీఆర్ఎస్‌కు చెందిన కార్పొరేటర్లు, నాయకులు బైక్ ర్యాలీలు నిర్వహించారు. దాదాపు అన్ని డివిజన్లలో నిర్వహించిన ర్యాలీలకు గాంధీ హజరయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో నాయకులు నిర్వహించిన బైక్‌ర్యాలీలలో పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్ హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానంద్‌నగర్ డివిజన్లలో చివిరి రోజు ర్యాలీలో పాల్గొన్నారు. నవంబర్ 9న నామినేషన్ల గడువు ముగిసినప్పటి నుంచీ బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ, కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్, బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్‌లు ఇంటింటి ప్రచారం, ఆత్మీయ సమ్మేళనాలు, కార్నర్ మీటింగ్‌లు, ర్యాలీలలో ప్రచారాన్ని హోరెత్తించారు. బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ ఎప్పటి నుంచో ప్రజల్లోనే ఉండటంతో ఆయన తరపున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంలో మూడు చోట్ల రోడ్ షో నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్ గౌడ్ తరుపున టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్ తరుపున కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా రోడ్ షో, తమిళ నాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై, తెలంగాణ బీజేపీ ప్రచార కమిటీ చైర్మెన్ ఈటెల రాజేందర్ ప్రచారం చేశారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన శేరిలింగంపల్లిలో ప్రచార ఘట్టం ప్రశాంతంగా ముగిసినట్లయింది.

ప్రలోభాల పర్వానికి సన్నద్ధం

ప్రచార పర్వం ముగిసిన వెంటనే ఆయా పార్టీలు ప్రలోభాలపై దృష్టి సారించాయి. ఓట్లు రాబట్టేందుకు దాదాపు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ సెక్షన్లలో డబ్బు పంపిణీకీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఒక్క రోజే గడువు ఉండటంతో ప్రలోభాలకు తెరలేపాయి. తాము ఎంచుకున్న పోలింగ్ స్టేషన్లలో ఇప్పటికే తమ సైన్యాన్ని డబ్బు పంపిణీకి సిద్ధంగా ఉంటినట్లు సమాచారం. ఓ వైపు ఎన్నికల కమిషన్ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఫ్లైయింగ్ స్క్వాడ్‌లతో పాటు ప్రత్యేక బృంధాలు డబ్బు పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి ప్రలోభాలకు గురి చేసినా, డబ్బు తీసుకున్నా కఠిన చర్యలు ఉంటాయని శేరిలింగంపల్లి రిటర్నింగ్ అధికారి బి.శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.



భెల్ ఎంఐజీ కాలనీలో కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి

కాంగ్రెస్ అభ్యర్థి బైక్ ర్యాలీ

శేరిలింగంపల్లి: ఎన్నికల ప్రచారం ముగింపు సందర్భంగా శేరిలింగంపల్లి కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్ భెల్ ఎంఐజీ కాలనీ, శేరిలింగంపల్లి ఆదర్శనగర్, నెహ్రూనగర్, బాపు నగర్, గోపీనగర్, చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలు, జాతీయ రహదారిపై భారీగా కార్యకర్తలు, నాయకులతో కలిసి బైక్ ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలను అందజేస్తుందన్నారు. సంక్షేమ ఫలాలు అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు.



వి.జగదీశ్వర్‌గౌడ్‌కు హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

క్రిస్టియన్ బిజినెస్, ప్రొఫెషనల్స్‌తో సమావేశం



మాదాపూర్: ఎల్బీస్టేడియంలో ప్రీక్రిస్మస్ వేడుకలను నిర్వహించిన సందర్భంగా మాదాపూర్‌లోని వెస్టిన్ హోటల్‌లో మంగళవారం క్రిస్టియన్ బిజినెస్, ప్రొఫెషనల్స్‌తో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా దైవసేవకులు డాక్టర్ డబ్ల్యూఎఫ్ కుముయి పాల్గొన్నారు. బిజినెస్, ప్రొఫెషనల్స్‌కి ఉండాల్సిన లక్షణాలను తెలిపారు. ఈకార్యక్రమంలో దాదాపు 140 మంది పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలను పాటించాలి

మాదాపూర్ డీసీపీ సందీప్ కుమార్



ఎన్నికల విధులపై దిశానిర్దేశం చేస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్ కుమార్

గచ్చిబౌలి: ఎన్నికల విధులు నిర్వహించే పోలీసులు ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని మాదాపూర్ డీసీపీ సందీప్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే సీఏపీఫ్, సీఆర్‌పీఎఫ్, రూట్ మొబైల్ సిబ్బంది, ఏఆర్ స్పెషల్ పార్టీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలని, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ ఎస్.నర్సింహ్మా రెడ్డి, ఏసీపీలు, ఎస్‌హెచ్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



శేరిలింగంపల్లిలో బీజేపీ గెలుపు ఖాయం

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలో బీజేపీ అభ్యర్థి ఎం.రవి కుమార్ యాదవ్ గెలుపు ఖాయమని గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని మధురానగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నుంచ ఇఅపూర్వ స్పందన వస్తోందని, బీజేపీకి భారీ మద్దతు లభిస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అండతో డబుల్ బెడ్ రూమ్‌లు, రేషన్ కార్డులు అందిస్తామన్నారు.



మధురానగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి



బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వండి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు చికోటి ప్రవీణ్

హఫీజ్‌పేట్ : ఎన్నికల్లో శేరిలింగంపల్లి నియోజకవర్గం అసెంబ్లీ అభ్యర్థి రవికుమార్ యాదవ్‌ను గెలిపించి బీజేపీ పార్టీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకులు చికోటి ప్రవీణ్ పేర్కొన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారం చివరి రోజు మియాపూర్ బొమ్మరిల్లు హోటల్ నిర్వహించిన హిందూ సామాజిక వర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి రవికుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ



హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం పీజేఆర్ ఎన్క్లేవ్‌కు వెళ్ళే దారిలో ఉన్న జగద్రక్ష శ్రీ ధర్మ శాస్తా అయ్యప్పస్వామి దేవాలయంలో మంగళవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వి.జగదీశ్వర్ గౌడ్ అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ వితరణకు ఆయన కుమారుడు వి.వైభవ్ గౌడ్ హాజరై ప్రసాదరావు గురుస్వామితో కలిసి అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం డీఆర్‌డీఏ జిల్లా పీడీ జయశ్రీరాజ్ సందర్శించారు. కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యాన్ని సేకరిస్తున్న తీరును తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. రైతు లకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రా ల వద్ద తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రవాణా చేసిన ధాన్యాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు.

పోస్టల్ బ్యాలెట్

శేరిలింగంపల్లి: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయానికి మంగళవారం చేరుకున్నారు. ఉద్యోగులు ఒక్కసారిగా భారీగా రావడంతో కార్యాలయం కిక్కిరిసిపోయింది. ఒక్క రోజే సాయంత్రం వరకు 221 మంది పోస్టల్ బ్యాలెట్ వేసినట్లు అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్ బైక్‌ర్యాలీ

గచ్చిబౌలి: శాసనసభ ఎన్నికల ప్రచార ముగింపు రోజైన మంగళవారం బైక్ ర్యాలీలతో శేరిలింగంపల్లి మార్మోగింది. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడిగాంధీ నాయకత్వంలో భారీ బైక్ ర్యాలీలు అన్ని డివిజన్లలో నిర్వహించారు. కార్పొరేటర్లు హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, మంజులారఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీలు నిర్వహించారు.

ర్యాలీలతో హోరెత్తిన రోడ్లు......

ఎన్నికల ప్రచారం చివరి రోజుల కావడంతో నాయకులు, కార్యకర్తలంతా సమిష్టిగా తమ తమ ద్విచక్రవాహనాలతో గచ్చిబౌలి, రాయదుర్గం, నానక్‌రాంగూడ, లింగంపల్లి, మాదాపూర్, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, కొండాపూర్, కొత్తగూడ వంటి ప్రాంతాలలో ర్యాలీలు సాగాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులంతా తమ చేతుల్లో పార్టీ పతాకాలను ఊపుతూ సందడి చేశారు.

ఖాజాగూడలో ఆరంభమైన గచ్చిబౌలి ర్యాలీలు......

ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాయలం వద్ద బారీ బైక్‌ర్యాలీని మాజీ కార్పొరేటర్ సాయిబాబా ప్రారంభించారు. అనంతరం మధురానగర్, రాయదుర్గం మీదుగా గచ్చిబౌలి, ఇందిరానగర్, వినాయక్‌నగర్, గుల్‌మొహర్ పార్కు, నల్లగండ్ల, శ్రీకృష్ణనగర్, గోపన్‌పల్లి, గోపన్‌పల్లితాండ, ఎన్టీఆర్‌కాలనీ. గౌలిదొడ్డి, నానక్‌రాంగూడ మీదుగా తిరిగి ఖాజాగూడ పార్టీ ఆఫీస్‌కు చేరుకున్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

తారానగర్‌లో..

శేరిలింగంపల్లి: తారానగర్‌లో బీఆర్ఎస్ ర్యాలీ కొనసాగింది. లింగంపల్లి వద్ద ఆరంభమైన ర్యాలి తారాగనగర్, కూరగాయలమార్కెట్ మీదుగా తిరిగి తారానగర్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆయనతో పాటు నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొన్నారు.

కొండాపూర్‌లో..

కొండాపూర్ డివిజన్‌లో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. బైక్ ర్యాలీని కార్పొరేటర్ షేక్ హమీద్‌పటేల్ ప్రారంభించారు. ఆయన ఆధ్వర్యంలో కొత్తగూడ, కొండాపూర్, మాదాపూర్, అంజయ్యనగర్, సిద్ధిఖీనగర్, గచ్చిబౌలి కూడలి వరకు కొనసాగింది.

ఆలయాలకు కార్తీక దీపాల శోభ





రాయదుర్గం: కార్తీక మాసంలో దీపాల అలంకారంతో ఆలయాల్లో ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. అందులో భాగంగా సోమవారం రాత్రి టెలికామ్‌నగర్‌లోని సాయి దత్తగణపతి దేవాలయంలో భక్తులతో దీపాలను వెలిగించి తమ భక్తిభావాన్ని చాటారు. ముఖ్యంగా శివలింగం, స్వస్తిక్, ఓం ఆకారంలో దీపాలను వెలిగించారు. అంతేకాకుండా ఆలయం అంతటా దీపాలను వెలిగించి ఆలయం కళకళలాడేలా చేశారు.

చంద్రమౌళీశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు.....

జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి అర్చనలు, పూజలు, అభిషేకాలు నిర్వహించి అలంకారం చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.



మేరీకోమ్‌కు సంకల్ప్ కిరణ్ పురస్కారం



మాదాపూర్: భారతీయ ఒలింపిక్ బాక్సర్, పద్మవిభూషణ్ మేరీకోమ్ సంకల్ప్ కిరణ్ పురస్కారాన్ని అందుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామం సాంప్రదాయ వేదికలో మంగళవారం సంకల్ప్ దివస్ 2023లో బాగంగా సుచిర్ ఇండియా ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని బ్రిటీష్ డిప్యూటి హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అందజేశారు. సుచిర్ ఇండియా చైర్మన్ లయన్ డాక్టర్ వై.కిరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది ఆందోళన

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ఆర్వో(రిటర్నింగ్ ఆఫీస్) కార్యాలయం ఎదుట ఎన్నికల సిబ్బంది ఆందోళనకు దిగారు. ఇక్కడ నివాసం ఉంటూ వేరే జిల్లాలో పనిచేస్తున్న ఎన్నికల సిబ్బంది తమకు పోలింగ్ బ్యాలెట్ ఇవ్వడం లేదంటూ ఆందోళనకు దిగారు. చాలా మంది సిబ్బంది ఓటు వినియోగించు కోకుండానే వెనుదిరిగారు. ఈ విషయాన్ని కలెక్టర్ శరత్‌కుమార్‌కి తెలియజేయడంతో వారికి కూడా పోలింగ్ బ్యాలెట్ ఇవ్వాలని ఆదేశించారు. సిబ్బంది ఆందోళన చేస్తున్నారని తెలిసి డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఆర్వో దేవుజా హుటాహుటిన వచ్చి పోలింగ్ బ్యాలెట్ ఇస్తున్నట్లు ప్రకటించడంతో ఆందోళన సద్దుమణిగింది. పోలింగ్ బ్యాలెట్ తీసుకొని సిబ్బంది ఓటుహక్కు సద్వినియోగం చేసుకున్నారు. దీనిపై ఆర్ఓను వివరణ కోరగా సిబ్బంది పనిచేసే చోట ఫాం-12 దరఖాస్తు చేసుకోలేదని, దీంతో పోలింగ్ బ్యాలెట్ ఇవ్వలేకపోయామన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.